సాక్షి
కామారెడ్డి

శనివారం । 21 । జూన్ । 2025



అక్రమ రవాణాకు వారధి

బాన్సువాడ డివిజన్‌లోని మూడు మండలాలను అనుసంధానించేందుకు నిర్మించిన బ్రిడ్జి అక్రమ రవాణాకు వారధిగా మారింది.

- 8లో ▸



ఎన్‌పీఏ తగ్గింది

నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నిరర్థక ఆస్తులు గణనీయంగా తగ్గాయని ఎన్‌డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.1 /23.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

‘విద్య, వైద్య రంగాలకు హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం’



బాన్సువాడ : విద్య, వైద్య రంగానికి హబ్‌గా బాన్సువాడను తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాల వద్ద రూ.40 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నర్సింగ్ కళాశాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

‘దాతల సహకారంతో కంప్యూటర్ ల్యాబ్‌లు’



భిక్కనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను అందించేందుకు దాతల సహకారంతో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయిస్తున్నట్టు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన భిక్కనూరులో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో మరిన్ని పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కామారెడ్డి టౌన్: యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ–ఈ, పీడబ్ల్యూడీ వారికి ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు www.tsstudycircle.in వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ ఆదాయం రూ.3 లక్షలలోపున్నవారు అర్హులని పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ. 258.30 కోట్లు జమ

కామారెడ్డి క్రైం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి శుక్రవారం సాయంత్రం వరకు జిల్లాలో 2,86,285 మంది రైతుల ఖాతాల్లో రూ. 258.30 కోట్ల రైతు భరోసా నిధులు జమయ్యాయి. ఈ విషయాన్ని డీఏవో తిరుమల ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇందులో కామారెడ్డి నియోజకవర్గంలోని 67,400 మంది రైతులకు రూ. 58.20 కోట్లు, ఎల్లారెడ్డి పరిధిలో 1,01,149 మంది రైతులకు రూ.89.80 కోట్లు, బాన్సువాడ పరిధిలో 30,496 మంది రైతులకు రూ.24.24 కోట్లు, జుక్కల్ పరిధిలో 87,240 మంది రైతులకు రూ.86.05 కోట్లు జమ అయ్యాయని వివరించారు.

వయోవృద్ధుల డేకేర్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం


కామారెడ్డి అర్బన్: జిల్లాలో వయోవృద్ధుల కోసం మల్టీ సర్వీసెస్ డే కేర్ సెంటర్ నిర్వహణ, సేవలు అందించడానికి స్వచ్ఛంద సంస్థలు 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి ప్రమీల సూచించారు. ఇతర వివరాలకోసం కలెక్టరేట్‌లోని 31వ నంబర్ హాల్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

‘డ్రగ్స్ మహమ్మారి బారిన పడొద్దు’

మాచారెడ్డి: డ్రగ్స్ మహమ్మారి బారిన పడొద్దని కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సంపత్ సూచించారు. పాల్వంచ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వారి కుటుంబ సభ్యులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాచారెడ్డి ఎస్సై అనిల్, ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్‌రావు, ఎంఈవో రామ్మోహన్‌రావు, హెచ్‌ఎం గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగం

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



- పెరుగుతున్న అవగాహన
- శారీరక, మానసిక దారుఢ్యానికి ఎంతో ఉపయుక్తం
- జీవితంలో భాగమైన యోగా

ఆధునిక ప్రపంచంలో జీవన విధానంలో వేగం పెరిగింది. పోటీ ప్రపంచంలో ఒత్తిడి సర్వసాధారణంగా మారింది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఒత్తిడిని చిత్తు చేయడానికి యోగాను ఆశ్రయిస్తున్నారు. నిత్య జీవితంలో భాగంగా మార్చుకుంటున్నారు. పలువురు దశాబ్దాలుగా యోగా వ్యాప్తికి కృషి చేస్తున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో యోగా వ్యాప్తికి కృషి చేసిన పలువురిపై కథనం..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉరుకులు, పరుగుల జీవితంలో చాలామంది మూడు పదుల వయసులోనే అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. బీపీ, షుగర్ పేషెంట్ల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోంది. గుండెపోట్లకు వయసుతో సంబంధం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో చాలా మంది ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నారు. వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్‌తోపాటు వివిధ రకాల వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరు యోగాపై ఆసక్తి చూపుతున్నారు. కనీసం అరగంట పాటు యోగాసనాలు వేస్తే ఏ సమస్య రాదనే అభిప్రాయం చాలా మందిలో వ్యక్తమవుతోంది.

మండలాల్లోనూ యోగా కేంద్రాలు..

కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలు, వివిధ మండలాల్లోనూ యోగా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. యోగాలో ప్రావీణ్యం పొందిన గురువులు చాలా మందికి ఉచితంగా శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. అంతేగాక స్కూళ్లలోనూ యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. పిల్లలతో యోగాసనాలు వేయిస్తూ వారిని వివిధ స్థాయిల్లో పోటీలకు పంపుతున్నారు. ప్రభుత్వం సైతం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి ప్రజలకు యోగా నేర్పిస్తోంది.

అన్ని వర్గాల్లోనూ ఆసక్తి...

గతంలో ఉద్యోగులు, వ్యాపారులు కొద్దిమంది మాత్రమే యోగా చేసేవారు. అయితే యోగాతో కలిగే ప్రయోజనాలను గుర్తించి చాలా మంది ఆసనాలవైపు మళ్లారు. చాలాచోట్ల యోగా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. అందుబాటులో కేంద్రాలు ఏర్పాటు కావడంతో అక్కడికి వెళ్లి యోగా నేర్చుకుంటున్నారు.

యోగా ఫ్యామిలీ..

ఎల్లారెడ్డి: జంగమాయిపల్లి గ్రామానికి చెందిన సంగ్లుగారి నాగరాజుగౌడ్ కుటుంబానికి యోగాతో విడ దీయలేని అనుబంధం ఉంది. కుటుంబ సభ్యులు యోగా నేర్చుకుని ఇతరులకు నేర్పిస్తున్నారు. నాగ రాజు గౌడ్ హరిద్వార్ వెళ్లి బాబా రాందేవ్ ఆశ్రమంలో యోగా నేర్చుకున్నారు. కొన్నేళ్లుగా గ్రామంలో ఉచితంగా యోగా నేర్పిస్తున్నారు. ఆయన భార్య సుజాతకు యోగా నేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆయుష్ విభాగంలో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కుమారుడు మధుగౌడ్ సైతం యోగా నేర్చుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెయింట్‌మేరి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్న మధు.. హైదరాబాద్‌లోని మానసిక రోగులకు ప్రతిరోజు యోగా నేర్పిస్తున్నాడు. నాగరాజు గౌడ్ కూతురు సంతోషిణి సైతం తండ్రి బాటలో పయనిస్తోంది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు హరిద్వార్‌లోని ఆచార్యకులంలో చదివి యోగాలో అత్యున్నత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో గోల్డ్‌మెడల్‌ను సాధించింది. ఇలా కుటుంబం మొత్తం యోగా నేర్చుకుని ఆదర్శంగా నిలుస్తోంది.



కుటుంబ సభ్యులతో నాగరాజుగౌడ్



శీర్షాసనం వేసిన నాగరాజు గౌడ్

యోగా ప్రదర్శనతో ఆకర్షితులై..

కామారెడ్డి అర్బన్: పాఠశాలలో ఓ ఎన్‌ఆర్‌ఐ ఇచ్చిన యోగా ప్రదర్శన ఆయనను ఆకర్షించింది. ఆ తర్వాత యోగా నేర్చుకుని ఇతరులకు నేర్పుతూ పాతికేళ్లుగా ముందుకు సాగుతున్నారు మూడ బాల్‌లింగం. ఆయన స్వగ్రామం అప్పట్లో నక్సల్స్ ప్రభావిత గ్రామమైన రామారెడ్డి మండలంలోని మద్దికుంట. ఆరో తరగతి చదువుతున్న రోజుల్లో ఎన్‌ఆర్‌ఐ బండి రాములు ఇచ్చిన యోగా ప్రదర్శన ఆయనపై ప్రభావం చూపింది. రాములు వద్ద యోగా నేర్చుకున్నాడు. ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతూనే పట్టణంలోని పలు ప్రయివేట్ పాఠశాలల్లో యోగా శిక్షకులుగా పనిచేశారు. స్థానిక ఆయుష్ కేంద్రంలో యోగా శిక్షకులుగా పనిచేస్తున్నారు. సుమారు 25 ఏళ్లుగా ఆయన యోగా గురువుగా సేవలందిస్తున్నారు. యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని బాల్‌లింగం పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో యోగాను తప్పనిసరి చేస్తే గ్రామీణ విద్యార్థులకు మేలు చేకూరుతుందని, యోగా శిక్షకులకు ఉపాధి లభిస్తుందని పేర్కొంటున్నారు.



యోగా సాధన చేస్తున్న బాల్‌లింగం

ఎనిమిది పదుల వయసులోనూ..

కామారెడ్డి అర్బన్ : జిల్లా కేంద్రానికి చెందిన గరిపల్లి అంజయ్య గుప్తా వయసు 84 ఏళ్లు. ఆయన ఈ వయసులోనూ నిత్యం యోగా సాధన చేస్తున్నారు. ఆర్యసమాజం స్ఫూర్తితో హైదరాబాద్‌లోని గాంధీ జ్ఞాన మందిరంలో 1980 ప్రాంతంలో యోగాసనాలు నేర్చుకున్నారు. అప్పటినుంచి యోగా సేవలో తరిస్తున్నారు. ఆధునిక కాలంలో కామారెడ్డి పట్టణంలో తొలి యోగా గురువుగా గుర్తింపు పొందారు. కుటుంబ సభ్యులు వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నా అంజయ్య మాత్రం యోగా కోసమే కామారెడ్డిలో నివాసం ఉంటున్నారు. ఆయన రోజు తెల్లవారుజామున గాయత్రి యజ్ఞం, యోగాసనాలు నిర్వహిస్తారు. పట్టణంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళల కోసం మూడు, పురుషుల కోసం ఆరు యోగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలలో అనేక యోగా పురస్కారాలను అందుకున్నారు. స్వామి రాందేవ్ బాబా ప్రబోధం మేరకు తాను యోగా వ్యాప్తికి కృషి చేస్తున్నానని అంజయ్య గుప్తా పేర్కొన్నారు. తన వద్ద యోగా నేర్చుకున్న వేలాది మంది ఇతరులకు గురువులుగా మారారంటూ సంతోషం వ్యక్తం చేశారు.



84 ఏళ్ల వయసులోనూ యోగా సాధన చేస్తున్న అంజయ్యగుప్తా

యోగానే ఇంటి పేరయ్యింది

కామారెడ్డి అర్బన్: ఆయన పేరు రాంరెడ్డి.. ఇంటి పేరు గడ్డం. కానీ పాతికేళ్లుగా యోగాకు అందిస్తున్న సేవలతో ఆయన ఇంటి పేరు మారిపోయింది. అందరూ యోగా రాంరెడ్డి అనే పిలుస్తున్నారు.

గడ్డం రాంరెడ్డి 2001లో కామారెడ్డి ఆర్యసమాజంలో గురువులు అంతిరెడ్డి, బ్రహ్మరాజ్, అంజయ్యగుప్తాల వద్ద ఏడాది పాటు యోగాలో శిక్షణ పొందారు. 2009లో కామారెడ్డి అశోక్‌నగర్‌లోని ఎస్‌ఎస్‌వై సెంటర్‌లో 14 మందితో ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం 32 ఉచిత యోగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో కామారెడ్డి పట్టణంలో అర ఎకరం స్థలంలో యోగా భవన్‌ను నిర్మింపజేశారు. రాంరెడ్డి జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్, భారత స్వాభిమాన్ ట్రస్టులకు అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. అనేక జిల్లా, రాష్ట్ర స్థాయి యోగా పోటీలు, మట్టి స్నానాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 2021 తర్వాత యజ్ఞ సహిత యోగా కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. జిల్లా యోగా భవన్‌లో రోజూ తెల్లవారుజామున యజ్ఞసహిత యోగా శుక్రవారం నాటికి 1,411 వ రోజుకు చేరిందని రాంరెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కృషితో ఐక్యరాజ్య సమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా డే గా ప్రకటించిన తర్వాత యోగాపై ప్రజలలో అవగామన పెరిగిందని పేర్కొంటున్నారు. యోగా అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. నిత్యం యోగా సాధన చేయాలని సూచిస్తున్నారు.



భాగ్యనగర్ సేవా సమితి జాతీయ స్థాయి సేవా పురస్కారం అందుకుంటున్న రాంరెడ్డి (ఫైల్)



వజ్రాసనం వేసిన విద్యార్థులు

గురుకులంలో యోగా

మద్నూర్: అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని శుక్రవారం మద్నూర్‌లోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. పీఈటీ జాదవ్ గణేష్ విద్యార్థులకు యోగా ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు సూర్యనమస్కారాలు, తాడాసనం, వృక్షాసనం, వజ్రాసనం, శశాంకాసనం, ధనురాసనం, చక్రాసనం, కుక్కుటాసనాలతోపాటు పిరమిడ్స్ వేశారు. 95 మంది విద్యార్థులు యోగా డే ఆకారంలో కూర్చున్నారు. మొత్తం 280 మంది విద్యార్థులు యోగా డేలో పాల్గొన్నారని పీఈటీ తెలిపారు.



మద్నూర్‌లో యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

‘యోగా డే’కు ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆయుష్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసి యోగా డేలో పాల్గొనాలంటూ ఆహ్వాన పత్రిక అందించారు. యోగా డే సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన వెంట ప్రకృతి వైద్యులు దేవయ్య, ఆయుర్వేద వైద్యులు వెంకటేశ్వర్లు ఉన్నారు.

నిర్వహించే ప్రాంతాలు..

- ఆయుష్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాలలో యోగా డే నిర్వహించనున్నట్లు ఆయుష్ డీపీఎం శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు శ్రీసరస్వతి విద్యామందిర్‌లో యోగా డే నిర్వహిస్తామని పేర్కొన్నారు.
- 8.30 గంటల 9.30 వరకు లింగంపేట నాగన్నబావి వద్ద నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొంటారని తెలిపారు.
- యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా యోగా భవన్‌లో ఉదయం 5.30 నుంచి 7.15 వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.
- జిల్లాకేంద్రంలోని ఆర్యసమాజ్‌లో 8 గంటలకు బీజేపీ ఆధ్వర్యంలో, మెహర్ బాబా ఫంక్షన్ హాల్‌లో యోగా గురువు బండి రాములు ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు యోగా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.



ఎమ్మెల్యే కేవీఆర్‌కు యోగా డే ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆయుష్ ప్రతినిధులు

మద్యం అమ్మితే చెప్పుదెబ్బలు

- లక్ష రూపాయల జరిమానా
- తీర్మానించిన మూడు గ్రామాల ప్రజలు

రాజంపేట: పచ్చని పల్లెల్లో చిచ్చుపెడుతున్న మద్యం రక్కసికి చెక్ పెట్టేందుకు గుండారం, నడిమితండా, ఎల్లాపూర్ తండాలవాసులు ఒక్కటయ్యారు. శుక్రవారం మూడు గ్రామాల ప్రజలు గుండారం ఎల్లమ్మ గుడి వద్ద సమావేశమై తమ గ్రామాలలో మద్యం విక్రయాలను నిషేధిస్తూ తీర్మానం చేశారు. తమ గ్రామాల పరిధిలో మద్యం అమ్మితే రూ. లక్ష జరిమానాతో పాటు ఏడు చెప్పుదెబ్బలు శిక్ష విధించాలని నిర్ణయించారు. మద్యం అమ్మిన వారిని పట్టించినవారికి రూ. 20 వేల బహుమతి అందిస్తామని తెలిపారు.



మద్య నిషేధంపై చర్చిస్తున్న ప్రజలు



సింగిల్‌విండో వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం క్యూ

మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద శుక్రవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. గోదాముకు యూరియా లారీలు వచ్చాయని తెలియగానే ఉదయమే సొసైటీకి తరలివచ్చి, క్యూలో నిల్చున్నారు. 1,800 సంచుల యూరియా వచ్చిందని అధికారులు తెలిపారు. కొరత లేదని పేర్కొన్నారు.

– తాడ్వాయి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి


- వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి
- దిశ సమావేశంలో ఎంపీ సురేశ్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేశ్ షెట్కార్, వేదికపై ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎంపీ సురేశ్ షెట్కార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ‘దిశ’ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ సురేశ్ షెట్కార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మెంబర్ సెక్రెటరీగా పాల్గొన్నారు. 22 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ తరపున యువతకు డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సేంద్రియ ఎరువులు, వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని వ్యవసాయ శాఖ సహాయక సంచాలక భవనం పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సర్కారు బడుల్లో మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, భవనాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 22 లక్షలుగా ఉన్న పని దినాలను 50 లక్షలకు పెంచాలని తీర్మానించారు. ప్రధాన మంత్రి కృషి సంచార్ యోజన కింద జిల్లాను చేర్చాలని, వాటర్ షెడ్ పథకానికి జిల్లాను అనుసంధానం చేయాలని తీర్మానిస్తూ ప్రతిపాదనలు పంపాలన్నారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల పెంపునకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. పిట్లం మండలంలో కిలోమీటర్ మేర రోడ్డు మరమ్మతులకుగాను అటవీ శాఖ అనుమతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఫారెస్ట్ డీఎఫ్‌వో నిఖితకు సూచించారు. పోచారం అభయారణ్యం వద్ద రహదారికి 1.5 కిలోమీటరు మేర అటవీ అనుమతులు తీసుకోవాలని తీర్మానించారు. నియోజకవర్గం మీదుగా జాతీయ రహదారి నిర్మాణంలో ఉన్నందున దారి వెంబడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. నోటీసులు పంపి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. శివానగర్ సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక, మొరం లభ్యతకు ఇబ్బంది లేకుండా చూడాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో తీర్మానించిన అంశాలు, అమలు చేయాల్సిన కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో తిరుమల ప్రసాద్, జిల్లా సంక్షేమాధికారి ప్రమీల, దిశ కమిటీ సభ్యులు కవిత, నగేష్, జాదవ్ నౌషా, దేశముఖ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

క్లుప్తంగా

చిత్రకళలో రాణింపు



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థి హెచ్‌డీఎస్ ప్రణయ్ చిత్రలేఖనంలో అద్భుత కళానైపుణ్యం చూపుతున్నారని హెడ్‌మాస్టర్ గంగాకిషన్, ఎంఈవో ఎల్లయ్యలు శుక్రవారం అభినందించారు. 9వ తరగతి ఇంగ్లిష్ పుస్తకంలో ఉన్న చిత్రాన్ని చూసి కథను చెప్పడంలో భాగంగా ప్రణయ్ మంచి ప్రతిభ చూపినట్లు వారు పేర్కొన్నారు. ప్రణయ్‌ను తల్లిదండ్రులు వెంకటేష్, లావణ్యలు చిత్రకళలో ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు.

తలసేమియా బాధితురాలికి రక్తదానం

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న గాంధారి మండలానికి చెందిన రుత్విక అనే 7 ఏళ్ల బాలికకు అత్యవసరంగా బి–పాజిటివ్ రక్తం అవసరం కావడంతో కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా రక్తం అందజేసినట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరమవుతుందని, యువత స్వచ్ఛంద రక్తదానం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రాణాలు కాపాడాలన్నారు.

మాదిగల ఉద్యమం మానవతా ఉద్యమం

రాజంపేట: మాదిగల ఉద్యమం మానవతా ఉద్యమంగా మారిందని ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల క్రితం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్.. అంతిమంగా వర్గీకరణ విజయంతో అన్ని వర్గాల ప్రజల కోసం మానవతా ఉద్యమంగా మారిందని ఎమ్మార్పీఎస్ పర్యవేక్షకులు మంథని సామెల్ మాదిగ అన్నారు. శుక్రవారం రాజంపేట, ఆర్గొండ గ్రామాలలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజల సమక్షంలో జరిపే విధంగా డప్పులతో దద్దరిల్లే విధంగా ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాలు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. నాయకులు సట్టిగారి లక్ష్మీ మాదిగ, కొత్తోళ్ల యాదగిరి మాదిగ, కొత్తూరు సాయిలు మాదిగ, సాయి వరుణ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు వారధి?

- మూడు మండలాలకు అనుసంధానంగా ఉన్న బ్రిడ్జి వద్ద నిఘా కరువు
- ఇసుక అక్రమ రవాణా, పేకాట స్థావరాలకు రాచమార్గం
- పోలీసుల నామమాత్రపు దాడులతోనే సరి



బీర్కూర్‌లో మంజీర నదిపై నిర్మించిన బ్రిడ్జి

బాన్సువాడ: ప్రజల సౌకర్యార్థం, రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు నిర్మించిన బ్రిడ్జిలు అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అనువుగా మారాయి. బాన్సువాడ డివిజన్‌లోని మూడు మండలాలైన బీర్కూర్, డోంగ్లీ, బిచ్కుందలకు అనుసంధానంగా మంజీర నదిపై నిర్మించిన బీర్కూర్ బ్రిడ్జి అక్రమ రవాణాకు రాచమార్గమైంది. ఈ బ్రిడ్జి వద్ద నిఘా లేకపోవడంతో అక్రమార్కులు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ బ్రిడ్జికి ఇవతల పక్కన బీర్కూర్ మండల కేంద్రం ఉంటే అవతల ఓ పక్కన బిచ్కుంద మండలం, మరొక పక్క డోంగ్లీ ఉంటుంది. ఈ బీర్కూర్, బిచ్కుంద, డోంగ్లీ మండలాల పరిధిలో మంజీర పరివాక ప్రాంతం ఉంటుంది. ప్రధానంగా ఆయా మండలాల పరిధిలో అక్రమ ఇసుక తరలింపు జోరుగా కొనసాగుతున్నట్లు విమర్శలున్నాయి. నిత్యం రాత్రి వేళల్లో టిప్పర్లు, బొలెరో, ట్రాక్టర్ల ద్వారా ఈ అక్రమ ఇసుక దందాకు అక్రమార్కులు తెరలేపారు. మంజీర నది నుంచి అక్రమంగా తరలించే ఇసుకను బ్రిడ్జి మీదుగా ఇటు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని ఆయా పట్టణాలు, మండల కేంద్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బ్రిడ్జి అవతల వైపు నుంచి బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, జుక్కల్ మండలాలకే కాకుండా కర్ణాటకలోని పలు ప్రాంతాలకు ఇక్కడి ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్రిడ్జికి మరో పక్క ఉన్న కుర్లా మంజీర ప్రాంతం నుంచి అక్రమార్కులు డోంగ్లీ, మద్నూర్ మండలాలతో పాటు మహారాష్ట్రకు సైతం తలిస్తున్నట్లు తెలిసింది.

మంజీర ప్రాంతంలో పేకాట స్థావరాలు..

బీర్కూర్ సమీపంలోని మంజీర నదిపై నిర్మించిన బ్రిడ్జి సమీపంలో కొందరు పేకాట స్థావరాలను ఏర్పాటు చేశారు. బీర్కూర్‌కు చెందిన ఓ పేకాట ముఠా నిత్యం బైక్‌లపై బ్రిడ్జి కింద నది ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. ఈ తతంగం కొన్నేళ్లుగా నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పలు మార్లు పోలీసులు దాడులు చేసి పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసిన ఘటనలున్నాయి. వారం రోజుల క్రితం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట రాయుళ్లు మాత్రం నెలకొక స్థావరాన్ని మారుస్తూ మూడు ముక్కలు ఆరు అడ్డాలుగా పేకాటను కొనసాగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పోలీసులు బీర్కూర్ పోలీస్ స్టేషన్ ముందు మాత్రమే నామమాత్రపు తనిఖీలు చేస్తూ పోలీసులు చేతులు దులుపుకుంటున్నారు. బైక్‌లపై వచ్చి వెళ్లే వారు హెల్మెట్ పెట్టుకున్నాడా..గతంలో బైక్‌లకు సంబంధించిన చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయా అనే విషయాలు చూస్తున్నారు కానీ బైక్‌లపై నిత్యం రాకపోకలు సాగిస్తున్న వారు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎందుకు వెళ్తున్నారనేది గమనించకపోవడం గమనర్హం.

మురికి నీరు నిల్వ ఉండకుండా చూడండి



పాల్వంచలో మురికి నీటిని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): పరిసరాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. శుక్రవారం పలు గ్రామాల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. గ్రామ పంచాయితీ సిబ్బంది గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గాంధారి(ఎల్లారెడ్డి): వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి నాగరాజుతో కలిసి ఎంపీడీవో మండల కేంద్రంలో వీధుల్లో పర్యటించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు.

భిక్కనూరు: మండల వ్యాప్తంగా భిక్కనూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు యెమిమా ఎంపీహెచ్ఈవో వెంకటరమణ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటా తిరిగి నిల్వ ఉన్న నీటిని పారబోయించారు.

బీబీపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీబీపేట కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా గ్రామంలోని ఆయా కాలనీల్లో సందర్శించారు. కుండీల్లో నీటిని తొలగించాలని దానివల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని అన్నారు.

జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామంలోని ప్రతి ఇంటింటికి తిరిగి జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించాలని మండల పంచాయితీ అధికారి మలహరి సూచించారు. శుక్రవారం భవానిపేట సబ్ సెంటర్‌లో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోగులను గుర్తించి మందులు పంపిణీ చేయాలని సూచించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మద్నూర్(జుక్కల్): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగా గురువులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో అంతర్జాతీయ యోగా డే సందర్భంగా శుక్రవారం యోగా వాక్, విద్యార్థులు, గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. యోగాతో కలిగే లాభాలను పతాంజలి యోగాపీట్ సభ్యులు వివరించారు.


విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం బిచ్కుందలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు అధికారులకు సహకారం అందించాలని కోరారు.

సామూహిక అక్షరాభ్యాసం



సాక్షి నెట్‌వర్క్: లింగంపేట మండలం అయిలాపూర్ ప్రాథమిక పాఠశాలలో, నాగిరెడ్డిపేట మండల వదల్‌పర్తి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులకు పలకలు, నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు.



లక్ష్మణుడు లేని రామాలయం

మీకు తెలుసా?



సీతారాముల మూలవిరాట్



ఇందల్వాయిలోని రామాలయం

సీతారాములతో పాటు లక్ష్మణుడి విగ్రహాలు ఉన్న రామాలయాలనే మనం దేశవ్యాప్తంగా చూస్తాం. కానీ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా లక్ష్మణుడి విగ్రహం లేని రామాలయాన్ని నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి గ్రామంలో చూడవచ్చు.

- ఇక్కడ ఉన్న రాముడి విగ్రహం ప్రత్యేకమైంది. విగ్రహంలోని ప్రభపై దశావతారాల రూపాలు, సాలిగ్రామాలు ఉన్నాయి.
- రాముడి ఎడమ తొడపై సీతాదేవి కూర్చొని ఉండటం మరో ప్రత్యేకత.
- సిర్నాపల్లి సంస్థానాదీశురాలైన శీలం జానకీ బాయి ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసి పూజలు చేసేవారని ఆలయ పూజారి తెలిపారు.
- ఈ ఆలయాన్ని ఆరువందల సంవత్సరాల క్రితం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.
- ఔరంగజేబు ఆలయాలను ధ్వంసం చేస్తుండగా కొందరు ఇందూరు ప్రాంతం నుంచి విగ్రహాలను తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చెప్పుకుంటారు.
- ఈ ఆలయంలో పూజలు చేస్తే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.

– ఇందల్వాయి

జీవితంలో యోగా తప్పనిసరి

- 14 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్న రఘువీర్



బాన్సువాడలో యోగా నేర్పుతున్న రఘువీర్

బాన్సువాడ: ప్రతి ఒక్కరి జీవితంలో యోగా తప్పనిసరి కావాలని యోగా శిక్షకులు రఘువీర్ గురూజీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా శిక్షకులు, పతంజలి ప్రతినిధి రఘువీర్ గురూజీని సాక్షి పలకరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్లలో ఆయా మండలాల్లో యోగాపై విస్తృత ప్రచారం చేశామన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతతో పాటు మానసిన దృఢత్వం ఏర్పడుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహార అలవాట్లను మార్చుకోవడంతో పాటు ధ్యానం చేయడం కూడా చాలా ముఖ్యమన్నారు. చిన్నప్పటి నుంచే యోగా, సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన ఉండాలని అన్నారు. 600లకు పైగా వివిధ ప్రాంతాల్లో యోగాపై ఆయన శిక్షణ ఇచ్చారు. రఘువీర్ గురూజీతో పాటు ఆయన సతీమణి వేదశ్రీ కూడా మహిళలకు యోగాసనాలు వేయించారు. బాన్సువాడ పట్టణంలోని పాత బాన్సువాడలో పతాంజలి ఆయుర్వేద మూలికల దుకాణం ఏర్పాటు చేసి అతి తక్కువ ధరలో ఔషధాలను అమ్ముతారు.

పాఠశాలకు లేటుగా వచ్చారని గేటుకు తాళం

- బయట ఎండలోనే ఉండిపోయిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- పోలీసులు సముదాయించడంతో గేటు తాళం తీసిన పాఠశాల సిబ్బంది



బాలికల గురుకుల పాఠశాల గేటు ముందు ఎండలో నిలబడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పాఠశాలకు లేటుగా వచ్చారని విద్యార్థులతో పాఠశాల సిబ్బంది అమానుషంగా ప్రవర్తించారు. గేటుకు తాళం వేసి విద్యార్థులు, తల్లిదండ్రులను లోనికి రానివ్వలేదు. వివరాలు.. తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలకు ఈనెల 15న విద్యార్థులను తీసుకురావాలని తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బంది తెలిపారు. కానీ తల్లిదండ్రులు 5 రోజులు లేటుగా తమ పిల్లలను గురుకుల పాఠశాలకు తీసుకొచ్చారు. దీంతో లేటుగా వచ్చారనే కోపంతో గురుకుల పాఠశాల సిబ్బంది కనీసం గేటు కూడా తీయలేదు. దీంతో మండుటెండలో విద్యార్థులు, తల్లిదండ్రులు గంటల తరబడి గేటు ముందు నిలబడాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి సిబ్బంది, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాల గేటు తాళం తీయించి విద్యార్థులను లోపలికి పంపించారు.

బైక్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు శుక్రవారం ఓ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మండలంలోని తాటిచెట్టుగడ్డ తండాకు చెందిన అంగోత్ దేవిసింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే దేవిసింగ్‌ను చికిత్స నిమిత్తం గోపాల్‌పేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలించారు. స్కూల్ బస్సుతోపాటు బైక్‌ను స్థానిక పోలీసులు నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి సంబంధించి ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ ప్రహరీ పనులు ఆపాలని నిరసన



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ అధికారులు ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లడానికి ప్రధాన దారి ఒక్కటే ఉంది. దానికి అడ్డంగా ప్రహరీ నిర్మాణం చేపట్టవద్దని శుక్రవారం స్థానికులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కనీసం 25 ఫీట్లు దారి వదిలి గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు. దారి మూసివేస్తే చిరువ్యాపారులు నష్టపోయి ఉపాధి కోల్పోతారని అన్నారు. ఆర్టీసీ అధికారులు దారి వదిలకుంటే అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. స్థానికులు నూకల రాజు, చిరు వ్యాపారులు, దుకాణదారులు ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటకు చెందిన ఆల్వా అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పోరెడ్డి మల్లారెడ్డి శుక్రవారం తెలిపారు. 10 రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14ఏళ్ల బాలిక రోడ్డుపై ఆడుకుంటుండగా ఆల్వా అనే యువకుడు సదరు బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని, బాలికను సఖీ కేంద్రానికి తరలించినట్లు ఆయన తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

తాడ్కోల్‌లో ఒకరి ఆత్మహత్య

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ శివారులో ఉన్న డబుల్ బెడ్‌రూం కాలనీలో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసముంటున్న ఇందూరు రాజు(40) గత కొన్నేళ్లుగా తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉండేవారు. ఇటీవల డబుల్ బెడ్‌రూం కాలనీకి వచ్చారు. గురువారం రాత్రి రాజు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే రాజు ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

బోర్ మోటార్ల దొంగకు దేహశుద్ధి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం రైతులు, స్థానికులు ఓ దొంగను పట్టుకొని దేహశుద్ధి చేశారు. పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో గల వ్యవసాయ బోర్ మోటార్లను నిందితుడు దొంగిలించి, ఓ స్క్రాప్ దుకాణం వద్ద విక్రయించడానికి యత్నించాడు. స్థానికులు అతడిని గమనించి పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నిందితుడు దొంగిలించిన మోటార్లను రైతులకు అప్పగించాలని పోలీసులను కోరారు.

ట్రాక్టర్ బోల్తా: ముగ్గురికి గాయాలు



రామారెడ్డి: మండలంలోని మద్దికుంట–రామారెడ్డి గ్రామాల మధ్య గురువారం ఓ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో మద్దికుంట గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు గాయాలైనట్లు సమాచారం. స్థానికులు క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు రాలేదని ఎస్సై రాజారాం తెలిపారు.

ఇంటికి నిప్పు

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఓ ఇంట్లో మంటలు వ్యాపించి సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సదరు ఇంట్లో నివాసం ఉంటున్న కోయల్కర్ లావణ్య మూడు రోజుల క్రితం ఆదిలాబాద్‌లోని వారి బంధువుల ఇంటికి వెళ్లింది. కాగా గురువారం అర్ధరాత్రి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి, ఇంట్లోని వస్తువులకు నిప్పుపెట్టారు. ఈ మేరకు లావణ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు శిక్ష

నిజామాబాద్ లీగల్: అదనపు కట్నం కోసం భార్యను వేధించి, ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు నిజామాబాద్ సెషన్స్ కోర్టు జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌కు చెందిన షేక్ ఇద్రీస్‌కు నడిపల్లికి చెందిన ఫౌజియా బేగంతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని నెలల తర్వాత భర్త, అత్త అదనపు కట్నం కోసం ఫౌజియాను వేధించడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. పుట్టింటి వారికి అదనపు కట్నం ఇచ్చే స్తోమత లేకపోవడం, అత్తింటి వారి వేధింపులు భరించలేక ఫౌజియా 2021లో తన ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి పుట్టింటి వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా భర్త, అత్త, బావలపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. విచారణ చేపట్టిన జడ్జి మృతురాలి భర్త షేక్ ఇద్రీస్‌కు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. అత్త కేసు విచారణ దశలో ఉండగా మృతి చెందగా, బావ షేక్ అలీని నిర్దోషిగా ప్రకటించింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బీర్కూర్: మండలంలోని సంబపూర్ గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. బీర్కూర్ గ్రామానికి చెందిన ప్రదీప్ అనే యువకుడు బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మండలంలోని సంబపూర్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు రిఫర్ చేశారు.

తనువు చాలించి.. నలుగురికి ప్రాణదాతగా నిలిచి

- మృతిచెందిన యువతి అవయవాలు దానం చేసిన కుటుంబసభ్యులు



పిట్ల సోహిత (ఫైల్)

కామారెడ్డి టౌన్: ఓ యువతి చనిపోయిన తర్వాత మరో నలుగురి ప్రాణదాతగా నిలిచింది. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో పిట్ల విజయ్–కళ్యాణి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కుమార్తె పిట్ల సోహిత(17) ఇటీవల ఇంటర్‌లో 991మార్కులు సాధించడంతో పాటు జేఈఈలో ఉత్తమ ర్యాంకు సాధించింది. జిల్లా కేంద్రంలో వారం రోజుల క్రితం ఎస్సెస్సీ విద్యార్థులు గెట్ టు గేదర్ నిర్వహించగా ఆమె పాల్గొనగా, మధ్యాహ్నం స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఆమెను జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. బ్రెయిన్‌లో రక్త స్రావం జరగడంతో వారం రోజులు పాటు ఐసీయూలో చికిత్స పొందుతూ గురువారం తన వుచాలించింది. కుటుంబ సభ్యుల అనుమతితో యువతి అవయవాలను దానం చేశారు. తండ్రి కామారెడ్డి మున్సిపల్ వాటర్‌వర్క్స్ విభాగంలో విధులు నిర్వహిస్తుండగా తల్లి గృహిణి. యువతి అంత్యక్రియలు శుక్రవారం జిల్లా కేంద్రంలో జరుగగా మున్సిపల్ కార్మికులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఎన్‌పీఏ 7.81 శాతానికి తగ్గింది

- ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి
- నగరంలో డీసీసీబీ వార్షిక మహాజనసభ



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎన్‌పీఏ (నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్) 14 శాతం నుంచి 7.81 శాతానికి తగ్గిందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి తెలియజేశారు. జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం 103వ వార్షిక మహాజనసభ నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించినందుకుగాను మహాజనసభ ధన్యవాదాలు తెలిపింది. బ్యాంకు సాధించిన ప్రగతి వివరాలను సీఈవో నాగభూషణం వివరించారు. అనంతరం రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌పీఏ తగ్గించేందుకు సొసైటీ చైర్మన్లు, సీఈవోలు, బ్యాంకు సిబ్బంది విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఉమ్మడి జిల్లాలో 50 శాతంకు పైగా సొసైటీలు 50 శాతానికిపైగా రుణాలు వసూలు చేసి బ్యాంకు అభివృద్ధికి పాటుపడ్డాయని పేర్కొన్నారు. ఇందుకుగాను ప్రతి సహకార సంఘానికి వారి షేర్ క్యాపిటల్‌లో 2 శాతం డివిడెండ్‌ను ప్రకటిస్తున్నామన్నారు. కాగా పెండింగ్‌లో ఉన్న ధాన్యం కమీషన్, ఉమ్మడి జిల్లాలో యూరియా కొరతపై సొసైటీ చైర్మన్లు ఆయన దృష్టికి తీసుకవచ్చారు. ఈ విషయమై మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీతో ఇదివరకే మాట్లాడినట్లుగా రమేశ్‌రెడ్డి తెలిపారు. అనంతరం బ్యాంకు అభివృద్ధికి కృషి చేసిన సొసైటీ చైర్మన్లను ఘనంగా సన్మానించారు. వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు, ఉమ్మడి సొసైటీ చైర్మన్లు, డీసీవో శ్రీనివాస రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.